క్లుప్తంగా

రామిరెడ్డికి ఉగాది శుభాకాంక్షలు



కావలి: మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని పట్టణంలోని ఆయన నివాసంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం కలిశారు. ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

మేకపాటికి సన్మానం



కలిగిరి: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా నియమితులైన ములకా శ్రీనివాసులురెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వింజమూరులో మేకపాటిని కలిసి శాలువాతో సత్కరించి తనకు రాష్ట్రస్థాయిలో పదవి రావడానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కలిగిరి జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఉన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

ఆత్మకూరు: ఈద్–ఉల్–ఫిత్ర్‌ను పురస్కరించుకుని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు పండగను కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని, రంజాన్ పండగ అందరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

ఇఫ్తార్ విందు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో సయ్యద్ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఆదివారం ఏర్పాటు చేశారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సోమేశ్వరాలయ అర్చకుడికి ఉగాది పురస్కారం



సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయం ప్రధానార్చకులు రామకృష్ణశర్మకు ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం నెల్లూరులో జరిగిన ఉగాది సంబరాల్లో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణశర్మకు కామాక్షి సమేత సోమేశ్వరాలయం ధర్మకర్తలు ఉప్పల సోమసుందరమూర్తి, ఉప్పల విజయ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

పొగాకు బ్యారెన్ల దగ్ధం

దుత్తలూరు: మండలంలోని కట్టకిందపల్లిలో రెండు పొగాకు బ్యారెన్లు ప్రమాదవశాత్తు ఆదివారం రాత్రి దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కొప్పోలు తిరుపతయ్య, వెంకటసుబ్బయ్య, బ్రహ్మానందానికి చెందిన రెండు బ్యారెన్లలో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకులు రాలి గొట్టాలపై పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఉదయగిరి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే బ్యారెన్లలోని పొగాకు, గొట్టాలు, కర్ర పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఊటుకూరు గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద హైవేపై సర్పంచ్ రొడ్డా వెంగమ్మ చొరవతో ఎల్ఈడీ దీపాలను ఏర్పాటుచేశారు. ఉదయగిరి-కావలి హైవే నుంచి ఊటుకూరు గ్రామం కిలోమీటరు దూరం ఉంది. రాత్రి వేళల్లో రోడ్డు మార్గాన్ని గుర్తించలేక బస్సుల్లో వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండడంతో ఊటుకూరు ముఖద్వారం వద్ద సర్పంచ్ ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు.

విద్యాసామగ్రి పంపిణీ



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు తాళ్లూరు లలితమ్మ విద్యా సామగ్రి ఆదివారం పంపిణీ చేశారు. తన కుమారుడు గిరినాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని 9వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, జామెంటరీ బాక్స్‌లు, పెన్నులు అందజేశారు.

వేడుకగా ఉగాది



వింజమూరు: విశేషాలంకరణలో గురప్పస్వామి



దుత్తలూరు: విశేషాలంకారంలో వెంగమాంబ దంపతులు



సంగంలో అపస్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



ఆత్మకూరులో వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



ఆత్మకూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూలో భక్తులు

కావలి: పట్టణ ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాదిని వేడుకగా జరుపుకొన్నారు. వేకువ జామునే లేచి తలంటు స్నానాలను ఆచరించి తమ ఇష్టదైవాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. సినిమాహాల్‌రోడ్డులోని గంగాభవాని అమ్మవారికి జలాభిషేకం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. పాతూరు శివాలయం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో బిందెల్లో కలశ జలాలను తీసుకుని ఊరేగింపుగా గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుని జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండల ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాదిని వేడుకగా జరుపుకొన్నారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరంలో సకల శుభాలు కలిగేలా చూడాలని తమ ఇష్టదైవాలను వేడుకున్నారు. సనాతన సంప్రదాయానికి కొనసాగింపుగా గ్రామాల్లోని ఇంటింటికి పురోహితులు వెళ్లి షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని పంచిపెట్టి పంచాంగ శ్రవణం వినిపించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ఉగాది వేడుకలను పురస్కరించుకుని వేకువ నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, క్షేత్రవాసి ప్రసన్న వెంకటేశ్వరస్వామికి పూలంగిసేవ నిర్వహించారు. సాయంత్రం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి పంచాగ శ్రవణం చేశారు.

అల్లూరు: స్థానిక గీతాశ్రమంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని అందరికీ పంచిపెట్టారు. నాయకులు బాలకృష్ణంరాజు, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• అల్లూరులోని విక్రమ్ స్కూల్‌లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు స్వయంగా ఉగాది పచ్చడిని తయారు చేశారు. ఉపాధ్యాయులు తెలుగు సంవత్సరాది ఉగాది విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వంశీ పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

ఆత్మకూరు: పట్టణ ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాదిని ఘనంగా జరుపుకొన్నారు. జేఆర్‌పేటలోని పద్మావతి, ఆండాల్ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉదయం విశేషాభిషేకాలు, పూజలు, అలంకరణ నిర్వహించారు. శ్రీవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం శ్రీవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన చలవపందిళ్ల వద్ద శ్రీవారికి భక్తులు కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

• ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ వద్ద ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. సీఐ గంగాధర్, దాత కంచి పరమేశ్వరరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, అపస్ కార్యవర్గ సభ్యులు పట్నం అనిల్‌కుమార్, ఆర్‌వీ రమణారెడ్డి, కృష్ణారెడ్డి, పెంచల రెడ్డి, రాఘవరెడ్డి, వెంకురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే చేజర్ల బస్టాండ్ సెంటర్‌లోనూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యవర్గసభ్యులు కే శ్రీనివాసులు, ఏ కిషోర్, బీ మురళి, ఉపాధ్యాయులు జీ ప్రసాద్, వెంకటేశ్వర్లు, హైమావతి, మోహన్, ప్రేమ్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో బెస్తరాజుల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ, హనుమంత సమేత కోదండరామస్వామి ఆలయంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం హనుమంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్క భజన ప్రదర్శన ఆకట్టుకుంది.

సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి భక్తులకు విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ప్రజలకు ఉగాది పచ్చడిని పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతిఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసుకోవాలని సూచించారు. అపస్ నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శివాలయం చైర్మన్ గునుపూడి గిరి, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: మండల ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నందిపాడులోని దేవరబోడుపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గణపతిపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుత్తలూరులోని సంజీవకొండపై ఉన్న రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. నర్రవాడలోని వెంగమాంబపేరంటాలు దేవస్థానంలో వెంగమాంబ-గురవయ్య దంపతులకు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ నిర్వహించారు.

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పండితులు తెలుగు సంవత్సర పంచాంగాన్ని చదివి వినిపించారు.వింజమూరులో చెన్నకేశవస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. నడిమూరులోని గురప్ప ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వింజమూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కలిగిరి: మండల ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాదిని వేడుకగా జరుపుకున్నారు. కలిగిరిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఉగాది పంచాంగాన్ని చదివి వినిపించారు.

సీతారామపురం: మండల ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాదిని వేడుకగా జరుపుకొన్నారు. ఉదయాన్నే తలస్నానం ఆచరించి తమ ఇష్టదైవాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. పండితుల పంచాంగ శ్రవణాన్ని వినిపించారు.



వింజమూరు: వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మేకపాటి



అల్లూరులోని విక్రమ్ స్కూల్‌లో..



సీతారామపురం: అంకాళమ్మ ఆలయంలో..



ఆత్మకూరులో ఉగాది పచ్చడి పంపిణీ



ఆత్మకూరురూరల్:మహిమలూరులో..



అల్లూరు: ఉగాది వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి



చేజర్ల బస్టాండ్ సెంటర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ



గంగమ్మకు జలాభిషేకం చేసేందుకు ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వైభవంగా అంకమ్మ జాతర



అంకమ్మమాను వద్ద పూలతో విశేషాలంకరణ



అంకమ్మకు పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అల్లారెడ్డి కుటుంబీకులు

ఆత్మకూరు: పట్టణంలోని పంటవీధిలో గ్రామదేవత అంకమ్మ జాతరను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అల్లారెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో ఏటా ఉగాది పండగ రోజు అంకమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా అంకమ్మమాను వద్ద పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అల్లారెడ్డి కుటుంబీకులు భాస్కర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రమణారెడ్డి, అనసూయమ్మ ఆధ్వర్యంలో పూజాసామగ్రిని మేళతాళాలతో నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా కథకులు ఒగ్గు కథ, అంకమ్మతల్లి పుట్టు పూర్వత్రాలను పాట రూపంలో వివరిస్తూ ఊరేగింపుగా ముందు సాగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన



సీతారామపురం: మండలంలోని పడమటిరొంపిదొడ్లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం మరమ్మతులకు గురవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ పాలకులు స్పందించి మంచినీటి పథకానికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఈద్-ఉల్-ఫిత్ర్ నేడు

కావలి: నింగిలో ఆదివారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో పట్టణంలోని ముస్లింలు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకొన్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సోమవారం ఈద్-ఉల్-ఫిత్ర్ జరుపుకోనున్నట్లు ముస్లిం మత పెద్దలు ప్రకటించడంతో నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలతో విరమించారు. కాగా రంజాన్ ప్రత్యేక నమాజ్‌లను సోమవారం నిర్వహించనున్నట్లు వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీ సేవా సంస్థ అధ్యక్షుడు మొగల్ సలీంబేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గాయత్రీనగర్ ప్రాంతంలోని అహలే హదీస్ జమాత్‌లో ఉదయం 6.45 గంటలకు, వైకుంఠపురంలోని మదీనా మసీదులో ఉదయం 7.30గంటలకు, కసాయివీధిలోని అక్సా మసీదులో ఉదయం 7.30 గంటలకు, ఇందిరమ్మ కాలనీలోని ఉస్మాన్ గనీ మసీదులో ఉదయం 7.30 గంటలకు, రైల్వేరోడ్డులోని ప్రతిష్టాత్మక జామియా మసీదులో ఉదయం 8 గంటలకు, కచ్చేరిమిట్టలోని నూర్ మసీదులో ఉదయం 8గంటలకు, బుడమగుంటగేట్ వద్ద ఉన్న మహమ్మదీయ మసీదులో ఉదయం 8.15 గంటలకు, గోరింకపాళెంలోని ఉమర్ మసీదులో ఉదయం 8.45గంటలకు, తుఫాన్ నగర్‌లోని ఈద్గా మైదానంలో ఉదయం 9 గంటలకు, ఉత్తరం పేట అహలే సున్నత్ జమాత్ మసీదులో ఉదయం 9.30గంటలకు బయాన్, 10.15 గంటలకు రంజాన్ నమాజ్ నిర్వహించనున్నట్లు ఆయా మసీదుల బాధ్యులు వెల్లడించారని ఆయన తెలిపారు. ముస్లిం సోదరులు తమ సమీప మసీదుల్లో రంజాన్ నమాజ్‌ల్లో పాల్గొని అల్లాహ్‌కృపకు పాత్రులు కావాలని కోరారు.

నిస్వార్థ సేవే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



ఆత్మకూరులో మాట్లాడుతున్న జిల్లా కార్యవాహ్ చెంచురామయ్య

ఆత్మకూరు: నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ్ చెంచురామయ్య పేర్కొన్నారు. పట్టణంలోని సత్రం వద్ద వెంకటేశ్వర్లురెడ్డి, మాధవ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే దేశ సేవలో ఆర్‌ఎస్‌ఎస్ ముందడుగు వేసిందని తెలిపారు. డాక్టర్‌జీ, గురూజీ నాయకత్వంలో అఖండ భారత దేశంలో గ్రామగ్రామాన ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు వెలిశాయని, ఈ ఏడాదితో ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి నూరేళ్లు పూర్తి చేసుకుంటుందన్నారు. దేశంలో వరదలు, భూకంపాలు వంటి విపత్కర పరిస్థితులు తలెత్తిన సమయంలో సేవలు అందించడంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ముందుంటారని పేర్కొన్నారు. దేశం సమైక్యంగా ఉండడంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ప్రముఖమైందని పేర్కొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవరావు బలిరామ్ హెడ్గేవార్ జయంతితో పాటు విశ్వావసు నామ ఉగాది వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆత్మకూరు ఖండ కార్యదర్శి మాధవ్ మాట్లాడుతూ హెడ్గేవార్ జీవితచరిత్ర, ఉగాది పండగ విశిష్టతను వివరించారు. భారతజాతి మొత్తం ఐక్యంగా ఉంటే భారతదేశం ప్రపంచానికి జగద్గురువుగా నిలబడుతుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు మద్దినేని శ్రీనివాసులు, నారాయణ, సుబ్బరాయుడు, పుల్లయ్య, ఇరగన శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్: మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యదర్శి మాధవ్

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



కావలిలో నిరసన తెలుపుతున్న పాస్టర్లు



అనంతసాగరంలో పాస్టర్ల నిరసన ప్రదర్శన

కావలి: ఇటీవల రాజమండ్రి వద్ద జరిగిన పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి స్పష్టమైన ప్రకటన చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో కచ్చేరిమిట్ట రోడ్డు నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ఆదివారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. పాస్టర్ ప్రవీణ్ మృతి అనేక అనుమానాలకు తావిస్తోందని, సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, క్రైస్తవ సమాజానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని క్రైస్తవ సంఘాల బాధ్యులు, పాస్టర్లు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై పాస్టర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు జాన్‌భాస్కర్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సంపత్‌కుమార్, పాస్టర్లు ఐజాక్ స్టీఫెన్, డాక్టర్ కానగల వెంకటరమణయ్య, బొర్రా బాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్‌లైన్లు



ఖాన్‌సాహెబ్‌పేట సమీపంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌లైన్



డీసీపల్లి-వెన్నవాడ మధ్యన తక్కువ ఎత్తులో ట్రాన్స్‌కో హైటెన్షన్ లైన్

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి నుంచి వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో మూడు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. అయితే ఈ మార్గంలో పలుచోట్ల విద్యుత్‌లైన్లు తక్కువ ఎత్తులో ప్రమాదభరితంగా ఉండడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు హడలిపోతున్నారు. రామస్వామిపల్లి నుంచి నల్లగొండ్ల వరకు రోడ్డు నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పీఎంజీఎస్‌వై నిధులు రూ.9 కోట్లను మంజూరు చేయించారు. ఏడాది క్రితం ప్రారంభించిన రోడ్డు పనులు ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ మార్గంలో డీసీపల్లి-బంట్లపల్లి మధ్యన విద్యుత్ లైన్ తక్కువ ఎత్తులో ప్రమాదభరితంగా ఉంది. విద్యుత్‌లైన్ ఎత్తు పెంపునకు ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. అలాగే డీసీపల్లి-వెన్నవాడ మధ్యన కృష్ణపట్నం నుంచి కడపకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌కో హైటెన్షన్ లైన్ ఉంది. గత కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్ డీసీపల్లి సమీపంలో రోడ్డుపై తక్కువ ఎత్తులో ప్రమాదభరితంగా ఉంది. ఇక్కడ విద్యుత్ లైన్ కింద ట్రాన్స్‌కో వారు అపాయం అనే బోర్డును ఏర్పాటు చేశారు. దాన్ని ఏర్పాటు చేసి రెండేళ్లు కావొస్తున్నా విద్యుత్‌లైన్ ఎత్తును పెంచేందుకు ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ మార్గంలో వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులతో పాటు కాలినడకన వెళ్లేవారు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ మార్గంలో రైతులు ధాన్యం, వరిగడ్డితో పాటు పొగాకు బేళ్లను ట్రాక్టర్లలో తరలిస్తుంటారు. విద్యుత్‌లైన్లు తగులుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు స్పందించి విద్యుత్‌లైన్ల సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.